
సాక్షి
నంద్యాల

ఆదివారం । 24 । నవంబర్ । 2024



'పది'కి ప్రణాళికేదీ?

పది పరీక్షల సమయం సమీపిస్తున్నా విద్యార్థుల ఉత్తీర్ణతపై ప్రభుత్వం దృష్టి సారించలేదు. ఇంత వరకు కార్యాచరణ ప్రణాళిక రూపొందించక పోవడంతో ఫలితాలపై ప్రభావం చూపుతుంది. -8లో



మహానందిలో భక్తుల సందడి

మహానంది: మహానందిలో శనివారం భక్తుల సందడి కనిపించింది. కార్తీకమాసం, వీకెండ్ కావడంతో భక్తులు తరలివచ్చి కోనేరుల్లో పుణ్య స్నానాలు ఆచరించి స్వామిని దర్శించుకున్నారు.



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం (అడుగులు)	: 1,633
ప్రస్తుతం	: 1,630.44
సామర్థ్యం (టీఎంసీలు)	: 105.788
ప్రస్తుతం	: 95.990
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	: 3,066
అవుట్ ఫ్లో	: 6,246

న్యూస్‌రీల్

జిల్లాలో 143 మంది పోలీసుల బదిలీ



మాట్లాడుతున్న ఎస్పీ అధిరాజ్‌సింగ్‌రాణా

బొమ్మలసత్రం: జిల్లాలో ఒకే చోట 5 ఏళ్లకు పైబడి విధులు నిర్వహిస్తున్న 143 మంది పోలీసులకు జిల్లా ఎస్పీ అధిరాజ్‌సింగ్‌రాణా బదిలీ చేశారు. ఆయన నాలుగు సబ్‌డివిజన్‌ల డీఎస్పీలతో శనివారం ఆయన సమావేశం నిర్వహించి బదిలీల ప్రక్రియ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో వివిధ పోలీస్‌స్టేషన్లలో పనిచేసే 55 మంది కానిస్టేబుళ్లు, 60 మంది హెడ్‌కానిస్టేబుళ్లు, 28 మంది ఏఎస్‌ఐలను స్థానం చలనం కల్పించినట్లు వెల్లడించారు. వీరంతా ఐదేళ్లకు పైబడి ఒకే చోట విధులు నిర్వహిస్తున్నందున బదిలీలు చేశామన్నారు. వెంటనే బదిలీ పోలీసులు కేటాయించిన స్టేషన్లలో విధుల్లో చేరాలని ఆయన ఆదేశించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ యుగంధర్‌బాబు, డీఎస్పీలు రామాంజినాయక్, శ్రీనివాసరెడ్డి, రవికుమార్, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

25లోగా 'పది' పరీక్ష రుసుము చెల్లించాలి

నంద్యాల(న్యూటౌన్): పదోతరగతి పరీక్ష ఫీజును ఈనెల 25లోగా చెల్లించాలని డీఈఓ జనార్దన్‌రెడ్డి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. 26వ తేది వరకు గడువు ఉందని, అయితే, చివరి రోజు ఏదైనా సర్వర్ సమస్య తలెత్తితే ఇబ్బంది పడాల్సి ఉంటుందన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకొని ఒక రోజు ముందే ఫీజు కట్టేలా చూడాలని ప్రధానోపాధ్యాయులకు సూచించారు.

మద్దిలేటయ్య ఒక్క రోజు ఆదాయం రూ. 5,95,257



బేతంచెర్ల: శ్రీలక్ష్మీ మద్దిలేటి నరసింహస్వామికి శనివారం ఒక్క రోజే రూ. 5,95,257 ఆదాయం వచ్చింది. కార్తీక మాసం నాలుగో శనివారాన్ని పురస్కరించుకుని స్వామి దర్శనార్థం భక్తులు భారీగా తరలివచ్చారు. దీంతో వివిధ సేవల ద్వారా ఆలయానికి భారీ ఆదాయం వచ్చినట్లు అసిస్టెంట్ కమిషనర్, ఈఓ రామాంజనేయులు తెలిపారు.ఆలయ సందర్శనకు వచ్చిన భక్తులకు ఆలయ అర్చకులు నామధారణతో పాటు తీర్థ ప్రసాద వితరణ చేశారు.

రేపు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

నంద్యాల: పట్టణంలోని కలెక్టరేట్ సెంటినరీ హాల్‌లో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం జరగనుంది. ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోనున్నట్లు జిల్లా కలెక్టర్ రాజకుమారి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9.30 గంటలకు ప్రారంభమయ్యే ఫిర్యాదుల స్వీకరణకు జిల్లా అధికారులందరూ హాజరు కావాలన్నారు. అలాగే జిల్లా కేంద్రంతో పాటు డివిజన్, నియోజకవర్గ, మండల స్థాయిల్లో కూడా ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ వెల్లడించారు.

శ్రీశైల జలాశయానికి తగ్గిన ప్రవాహం

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలం జలాశయానికి వరద ప్రవాహం దాదాపుగా తగ్గింది. శుక్రవారం నుంచి శనివారం వరకు సుంకేసుల నుంచి కేవలం 154 క్యూసెక్కుల నీరు మాత్రమే వచ్చింది. జలాశయం నుంచి మాత్రం 43,364 క్యూసెక్కుల నీరు దిగువ ప్రాజెక్ట్‌లకు విడుదలైంది.అందులో అత్యధిక పరిమాణాన్ని తెలంగాణ ఎడమగట్టు విద్యుత్ కేంద్రం ద్వారా దిగువకు తరలించారు. ఎడమగట్టుకేంద్రంలో 14.912 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేసి నాగార్జునసాగర్‌కు 32,625 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. అలాగే కల్వకుర్తి ఎత్తిపోతలకు 1,149 క్యూసెక్కులు, హంద్రీనీవా సుజలస్రవంతికి 1,590 క్యూసెక్కులు, పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటరీ ద్వారా 8,000 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. శనివారం సాయంత్రం సమయానికి సుంకేసుల నుంచి శ్రీశైలంకు 1,368 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతుంది.డ్యాం నీటిమట్టం 871.70 అడుగులకు చేరుకోగా, జలాశయంలో 149.0620 టీఎంసీల నీటి నిల్వలు ఉన్నాయి.

రూ. 5 లక్షల విరాళం

ఆలూరు: స్థానిక శ్రీ బెళ్లగుండా ఆంజనేయ స్వామి దేవాలయం అభివృద్ధికి ఆలూరు పట్టణానికి చెందిన సోడాల వెంకటరమణ, గోవిందమ్మ దంపతులు రూ. 5 లక్షలు విరాళాన్ని అందజేశారు. ఈ నేపథ్యంలో శనివారం ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు వీకే.చౌదరి, శ్రీనివాసులు దాతలను అభినందించి సత్కరించారు.

"


వలంటీరు వ్యవస్థను కొనసాగిస్తాం.. వారికి నెలకు రూ.10 వేలు పారితోషికం అందిస్తాం. అనేక మందిలో సమర్థత ఉంది. తెలివి తేటలు ఉన్నాయి ... వర్క్ ఫ్రం హోం ద్వారా వీరి సేవలను ఉపయోగించుకుంటాం. నిరుద్యోగ భృతి నెలకు రూ.3 వేలు ఇస్తాం.

– ఎన్నికలకు ముందు ఉగాది పంచాంగ శ్రవణం కార్యక్రమంలో చంద్రబాబునాయుడు

వలంటీర్ల వ్యవస్థే లేనప్పుడు ఎలా కొనసాగిస్తాం. లేని పిల్లవానికి ఏమి పేరు పెట్టారన్నట్లుంది.

– శాసనమండలిలో మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి

- వలంటీర్లకు కూటమి సర్కారు షాక్
- ఎన్నికల సమయంలో రూ.10వేలు వేతనం పెంచుతామని హామీ
- అధికారంలోకి వచ్చి ఆరు నెలలైనా పట్టించుకోని ప్రభుత్వం
- ఇప్పుడు ఏకంగా వారి ఉద్యోగాలకే ఎసరు
- తాజాగా వలంటీర్ వ్యవస్థే లేదని మంత్రి ప్రకటన
- జిల్లాలో వీధిన పడిన 8761 వలంటీర్ల కుటుంబాలు
- న్యాయం కోసం ఆందోళన బాట



జిల్లాలో గ్రామ సచివాలయాలు	409
మొత్తం వలంటీర్లు	6,870
వార్డు సచివాలయాలు	107
మొత్తం వలంటీర్లు	1,891

నమ్మించి.. వంచించి!

మోసం చేయడంలో ఎవరైనా చంద్రబాబు తర్వాతనే అనేందుకు వలంటీర్ల ఉదంతమే ఓ నిదర్శనం. ఎన్నికల ముందు వేతనం రెండింతలు పెంచుతామని నమ్మించి అధికారంలోకి వచ్చిన తర్వాత నయవంచనకు పాల్పడ్డారు. మొదట వారి నుంచి ఫోన్లు లాక్కొన్నారు. తర్వాత జీతాలు నిలిపేసి.. సేవలకు దూరం చేశారు. తమను ఉంచుతారా.. తొలగిస్తారా.. అనే అయోమయంలో ఉన్న వలంటీర్లకు తాజాగా కూటమి ప్రభుత్వం షాక్ ఇవ్వడంతో రోడ్డున పడ్డారు.

నంద్యాల: కూటమి ప్రభుత్వంలో కొత్త ఉద్యోగాల కల్పన దేవుడెరుగు, ఉన్న వారికే భద్రత లేదు. వివిధ కారణాలు చూపి తొలగిస్తోంది. దేశ వ్యాప్తంగా ఆదర్శంగా నిలిచిన వలంటీరు వ్యవస్థకే ఇప్పుడు ఎసరు పెట్టింది. వీరు గత ప్రభుత్వం అమలు చేసిన అనేక సంక్షేమ పథకాలను అర్హులైన పేద, మధ్య తరగతి వర్గాల దరికి చేరి వారి మన్ననలు పొందారు. అలాంటి వలంటీర్లపై నేడు కూటమి ప్రభుత్వం కుట్ర చేసి వారిని శాశ్వతంగా ఇళ్లకు పంపేందుకు రంగం సిద్ధం చేసింది. ఎన్నికల సమయంలో తాము అధికారంలోకి వచ్చిన వెంటనే వలంటీర్ల వ్యవస్థను కొనసాగిస్తామని, పారితోషికం కూడా రూ.5 వేల నుంచి రూ.10 వేలకు పెంచుతామని నమ్మబలికింది. అయితే అధికారంలోకి వచ్చిన నాటి నుంచి నేటి వరకు వారికి వేతనాలను నిలిపి వేయడంతో పాటు నేడు వలంటీర్ల వ్యవస్థకు జీఓనే లేదని తేల్చేసింది. దీంతో ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని వలంటీర్లు రోడ్డెక్కి ఆందోళనలు చేసేందుకు సిద్ధమయ్యారు.

నాడు వలంటీర్ల సేవలకు పట్టం

వలంటీర్లు ఎన్నికల ముందు వరకు తెల్లవారక ముందే అవ్వా, తాతలను నిద్రలేపి నిస్వార్థంగా పెన్షన్లు అందించారు. నిరక్షరాస్యులైన తల్లిదండ్రుల పిల్లల చదువులకు అవసరమైన సర్టిఫికెట్లను ఇంటి ముంగిట్లోనే అందించారు. ఇలా ప్రభుత్వం అందించే అనేక సంక్షేమ పథకాలను పేదల దరికి చేర్చారు. ఎలాంటి లాభాపేక్ష లేకుండా అతి తక్కువ గౌరవ వేతనంతో సేవలు అందించడంతో నాడు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వారిని ఏటా అవార్డులతో సత్కరించింది. గత ఫిబ్రవరిలో సేవా వజ్రకు రూ.45 వేలు, సేవా రత్నకు రూ.30 వేలు, సేవా మిత్రకు రూ.15 వేల నగదు బహుమతులు అందించి ప్రోత్సహించింది.

తొలుత విషం చిమ్మి.. ఎన్నికల సమయంలో నమ్మించి

జిల్లాలో మొత్తం 516 గ్రామ/వార్డు సచివాలయాలున్నాయి. వీటి పరిధిలో 8,761 మంది వలంటీర్లు ఉన్నారు. సార్వత్రిక ఎన్నికల ముందు వరకు 'జగనన్న సైన్యం' అంటూ వలంటీర్ వ్యవస్థపై కూటమి నేతలు విషం చిమ్మారు. 'అదేం ఉద్యోగం ? మూటలు మోసేది కూడా ఓ ఉద్యోగమేనా?' అంటూ హేళన చేశారు. ఎన్నికలు సమీపించేకొద్దీ వారు స్వరం మార్చారు. వలంటీర్ వ్యవస్థను కొనసాగిస్తామని, వారి వేతనాన్ని రూ.5 వేల నుంచి రూ.10 వేలకు పెంచుతామని నమ్మించారు. వారి మాయమాటలు నమ్మిన వలంటీర్లు కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో వేతనాలు పెంచుతారని ఆశ పెట్టుకున్నారు. ఆరునెలలవుతున్నా విధుల్లోకి తీసుకోలేదు. జీతాలు పెంచలేదు. ఇటీవలే రాష్ట్రంలో వలంటీర్ల వ్యవస్థ లేదని, వలంటీర్లను కొనసాగించే పరిస్థితి లేదని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి శాసన మండలిలో తేల్చి చెప్పడంతో కూటమి ప్రభుత్వం దగా బయటపడింది. నాడు ఓట్ల కోసం తమను నమ్మించి, నేడు అధికారంలోకి వచ్చాక రోడ్డున పడేశారని జిల్లాలోని వలంటీర్లు మండిపడుతున్నారు.

ప్రభుత్వం మోసం చేసింది



తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రూ.5వేలు ఉన్న జీతాన్ని రూ.10వేలు చేస్తామని నమ్మించింది. అధికారంలోకి వచ్చాక మమల్ని పట్టించుకోవడం లేదు. జీతం పెంచుతామని చెప్పి చివరకు ప్రభుత్వం ఉద్యోగమే లేకుండా చేస్తుంది. సర్కారు తమకు చేసిన మోసాన్ని ఎండగడతాం.

–డి.అజయ్, గడివేముల

నమ్మించి ఎసరు పెట్టారు



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలో ఉండగా వలంటీర్లను టీడీపీ, జనసేన నాయకులు హేళన చేశారు. ఎన్నికలు దగ్గర పడేకొద్దీ స్వరం మార్చారు. వలంటీర్ వ్యవస్థను తీసి వేయమని, ఉన్న జీతాన్ని రెండింతలు పెంచుతామని చెప్పి నమ్మించారు. అధికారంలోకి వచ్చాక ఉన్న ఉద్యోగానికి ఎసరు పెట్టారు.

– బి.విజయ్‌కుమార్, లింగాపురం, బండిఆత్మకూరు

హామీ అమలు చేయాలి



వలంటీర్ వ్యవస్థను కొనసాగిస్తామని నాడు కూటమి నాయకులు హామీ ఇచ్చారు. ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలి. మమ్మల్ని విధుల్లోకి తీసుకోవాలి. ఈ విషయంలో న్యాయం జరిగే వరకు పోరాడుతాం. ప్రభుత్వం మోసం చేస్తే ప్రతి ఇంటికి వెళ్లి చెబుతాం. తొలగించే ఉద్దేశం ఉంటే ఎన్నికల ముందే చెప్పాలి..అధికారంలోకి వచ్చాక మోసం చేయకూడదు!

–శ్రీనివాసులు, పెట్నికోట గ్రామం, కొలిమిగుండ్ల

మంత్రి ప్రకటన సిగ్గుచేటు



గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని ప్రజలకు అనేక రకాల సేవలు అందించిన వలంటీర్లు విధుల్లో లేరని ఎన్నికలకు ముందు ఎందుకు చెప్పలేదు. వలంటీర్ల సేవలను గుర్తిస్తామని, ఈ వ్యవస్థను కొనసాగిస్తామని చెప్పి ఇప్పుడు శాసన మండలిలో సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి వలంటీర్ వ్యవస్థ లేదని ప్రకటించడం సిగ్గుచేటు. విధుల్లోకి తీసుకునే వరకు ఆందోళన చేస్తాం.

– మహబూబ్‌హుసేన్, గిద్దలూరు గ్రామం, సంజామల

ఎన్నికల హామీ అమలేదీ?



కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న వలంటీర్లు, సీఐటీయూ నాయకులు

నంద్యాల(న్యూటౌన్): ఎన్నికల ముందు వలంటీర్ వ్యవస్థను కొనసాగించడంతో పాటు వేతనం పెంచుతామని కూటమి నాయకులు హామీ ఇచ్చారు. ఇప్పుడు దీనిని అమలు చేయాలని వలంటీర్లు రోడ్డెక్కారు. తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో వారు శనివారం జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు.ఈ సందర్భంగా యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఏసురత్నం, కార్యదర్శి బాలవెంకట్ మాట్లాడుతూ గ్రామ, వార్డు వలంటీర్లకు పెండింగ్‌లో ఉన్న బకాయిలను చెల్లించడంతో పాటు ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు వేతనం రూ.10వేలకు పెంచాలన్నారు. దీనిపై వెంటనే సర్కారు స్పందించాలని లేకపోతే ఆందోళన కార్యక్రమాలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు, వలంటీర్లు లక్ష్మణ్, మధుశేఖర్, సుధాకర్, భాగ్యలక్ష్మి, స్వరాజ్య లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

లింక్ లేకుంటే రాయితీ లేనట్లే!

- బ్యాంక్ ఖాతాకు ఎన్‌పీసీఐ లింక్ తప్పని సరి
- ఆదేశాలు జారీ చేసిన కేంద్ర ప్రభుత్వం
- జిల్లాలో 1.94 లక్షల ఖాతాలకు అనుసంధాన కార్యక్రమం
- ఇప్పటికే ప్రారంభమైన ప్రక్రియ



గోస్పాడులో ఎన్‌పీసీఐ లింకు చేస్తున్న పోస్టల్ అధికారి

గోస్పాడు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వివిధ సంక్షేమ పథకాల ద్వారా అందించే రాయితీలకు ఎన్‌పీసీఐ (నేషనల్ పేమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా) లింక్ తప్పనిసరి చేశాయి. దీంతో బ్యాంకు ఖాతాదారులు ఎన్‌పీసీఐ లింకు చేయించుకునేందుకు ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల వివిధ సంక్షేమ పథకాలకు సంబంధించి ఎన్‌పీసీఐ లింకు ఉన్న బ్యాంక్ ఖాతాలు లేకపోవటంతో ప్రభుత్వాల నుంచి వారికి పథకాలు అందకుండా పోయాయి. దీనిని గుర్తించిన కేంద్ర ప్రభుత్వం గ్రామ పంచాయతీల పరిధిలో ఎన్‌పీసీఐ లింకులు లేని ఖాతాల జాబితాలను ఆయా ప్రాంతాల వారీగా అధికారులకు పంపించి వాటిని వెంటనే లింక్ చేయించాలని ఈనెల 6వ తేదీన ఆదేశాలు జారీ చేసింది. దీంతో అధికారులు ప్రత్యేక క్యాంపులు నిర్వహిస్తున్నారు. లబ్ధిదారులతో పాటు 18 ఏళ్లు నిండివారితో పోస్టాఫీసుల్లో కొత్త ఖాతాలు తెరిపించే బాధ్యతను సచివాలయ సెక్రటరీ, వెల్ఫేర్, మహిళాసంరక్షణ కార్యదర్శి, డిజిటల్ అసిస్టెంట్, సర్వేయర్లు, అగ్రికల్చర్ సిబ్బందికి అప్పగించారు.

బ్యాంక్ ఖాతాకు ఆధార్ అనుసంధానం తప్పనిసరి..

ప్రభుత్వం నుంచి మంజూరయ్యే ఏ సంక్షేమ పథకమైనా లబ్ధిదారులకు నేరుగా అందాలంటే బ్యాంకు ఖాతా మనుగడలో ఉండాలి. కొందరికి ఒకటి నుంచి రెండు, మూడు బ్యాంక్ ఖాతాలు ఉండి వాటిలో కొన్ని వినియోగంలోకి లేకపోవడంతో సమస్యలు తలెత్తుతున్నాయి. ఈ విషయాన్ని కేంద్ర ప్రభుత్వం గుర్తించి మనుగడలోలేని ఖాతాల వివరాలు పునరుద్ధరించుకునేలా చర్యలు చేపట్టింది. జిల్లాలో 1,94,424 మందికి పైగా ఖాతాదారులకు ఎన్‌పీసీఐ లింక్ లేనట్లు గుర్తించారు. వారందరికీ అధికారుల ద్వారా సమాచారం అందించి లింక్ చేసుకోవాలని సూచిస్తున్నారు. పోస్టల్ డిపార్ట్‌మెంట్ ద్వారా గ్రామ, వార్డు సచివాలయాల్లో స్పెషల్ క్యాంపులు నిర్వహిస్తున్నారు.

ఖాతాదారులు ఎన్‌పీసీఐ చేయించుకోవాలి

ప్రతి బ్యాంకు ఖాతాదాదారులు అకౌంట్‌కు ఎన్‌పీసీఐ లింక్ ఉందా లేదా అని సరి చూసుకోవాలి. లేకపోతే ప్రత్యేక క్యాంపుల ద్వారా లింక్ చేస్తున్నాం. జిల్లాలో ఎన్‌పీసీఐ లింకులేని వారి జాబితాలోని వారందరికీ ఎన్‌పీసీఐ లింక్ పూర్తి చేసేలా సంబంధిత శాఖ ద్వారా చర్యలు చేపట్టాం. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి.

–శివారెడ్డి, డీఎల్‌డీఓ, నంద్యాల

యువతతోనే దేశాభివృద్ధి

- క్లస్టర్ యూనివర్సిటీ యువ తరంగ్ వేడుకల్లో సినీ నటుడు సుమన్



మాట్లాడుతున్న సినీనటుడు సుమన్

కర్నూలు సిటీ: యువత దేశ సంపద అని, దేశాభివృద్ధికి నూతన ఆవిష్కరణలు చేయాలని సినీ నటుడు సుమన్ అన్నారు. శనివారం క్లస్టర్ యూనివర్సిటీ యువ తరంగ్–2024 ఇంటర్ కాలేజీ క్రీడా పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమానికి సుమన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తల్లిదండ్రులు, గురువులను మరచిపోకూడదని, అందరి జీవితంలో వారి పాత్ర కీలకమైందన్నారు. దురలవాట్లకు దూరంగా ఉండి ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలన్నారు. అనంతరం క్లస్టర్ వర్సిటీ వీసీ ఆచార్య డీవీఆర్ సాయిగోపాల్ మాట్లాడుతూ సమాజంలో సమస్యలు లేని వ్యక్తి అంటూ ఉండడని వాటిని ఎదుర్కొని విజయం సాధించినప్పుడే మన శక్తి ఏమిటో నిరూపితం అవుతుందన్నారు. అనంతరం వర్సిటీ రిజిస్ట్రార్ కట్టా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ వర్సిటీకి 12బీ గుర్తింపు, న్యాక్, ఎన్‌ఐఆర్‌ఎఫ్ ర్యాంకింగ్ ప్రభుత్వ సహకారంతో సాధిస్తామన్నారు. వచ్చే ఏడాది ఫిబ్రవరి 8వ తేదీన మొదటి స్నాతకోత్సవాన్ని నిర్వహించనున్నామన్నారు. కార్యక్రమంలో కర్నూలు నగరపాలక సంస్థ కమిషనర్ రవీంద్రబాబు, సిల్వర్‌జూబ్లీ, ప్రభుత్వ డిగ్రీ కాలేజీల ప్రిన్సిపాళ్లు డాక్టర్ వీవీఎస్ కుమార్, డాక్టర్ ఇందిరాశాంతి ప్రసంగించారు. క్లస్టర్ వర్సిటీపై రచయిత యలపర్తి రమణయ్య సభలో పాట పాడారు.

పకడ్బందీగా మెగా పేరెంట్ టీచర్స్ సమావేశం

- పూర్వపు విద్యార్థులను ఆహ్వానించి వారి సహకారం తీసుకోవాలి
- పిల్లల బంగారు భవిష్యత్తు కోసం బడి వైపు ఒక అడుగు నినాదం'తో ఫ్లెక్సీలు
- ఎంఈఓలు, ప్రధానోపాధ్యాయులకు జిల్లా కలెక్టర్ ఆదేశం



మాట్లాడుతున్న కలెక్టర్ రాజకుమారి

నంద్యాల: డిసెంబర్ 7వ తేదీన జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో మెగా పేరెంట్ టీచర్స్ సమావేశాన్ని పక్కా ప్రణాళికతో పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి ఎంఈఓలు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని ఎస్‌బీసీ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి మెగా పేరెంట్ టీచర్స్ మీటింగ్ యాక్షన్ ప్లాన్ పై దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కార్యక్రమంలో వేదికపై ప్రదర్శించే ఫ్లెక్సీ పై ఎలాంటి ఫొటోలు ఉండకూడదన్నారు. 'పిల్లల బంగారు భవిష్యత్తు కోసం బడివైపు ఒక అడుగు' అనే నినాదంతో ఫ్లెక్సీలు తయారు చేసి ప్రదర్శించాలన్నారు. అతిథులకు వేదికపై బొకేలు ఇవ్వకుండా రెండు లేదా మూడు పుష్పాలు అందించి స్వాగతం పలకలన్నారు. కార్యక్రమానికి సంబంధించిన ఆహ్వాన పత్రికలు ప్రతి పేరెంట్‌తో పాటు ప్రజాప్రతినిధులు, దాతలు, పూర్వపు విద్యార్థులకు అందించాలన్నారు. పాఠశాల గదులతో పాటు పరిసర ప్రాంతాల్లో 100 శాతం పారిశుద్ధ్య పనులు చేపట్టి స్థానికంగా లభ్యమయ్యే పుష్పాలతో పాఠశాలలను సుందరీకరించాలన్నారు. తరగతి గదుల్లోని బోర్డులపై చక్కటి కొటేషన్లు విద్యార్థులతో రాయించాలన్నారు. వేదికపై రాజకీయ ఉపన్యాసాలు లేకుండా పిల్లలు ఎలా చదువుతున్నారు, తోటి విద్యార్థులతో ఎలా ఉంటున్నారు ఇలా వారి భవిష్యత్తుకు ఉపయోగపడేలా ప్రసంగాలు ఉండాలన్నారు. సమావేశంలో వార్షిక పాఠ్యప్రణాళికతో పాటు పోటీ పరీక్షలకు అవసరమయ్యే అదనపు ప్రణాళికపై కూడా చర్చా గోష్ఠులు జరపాలన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు, పాఠశాల ఉపాధ్యాయుల మధ్య సంబంధ బాంధవ్యాలు ఉండాలన్నారు. సమావేశాలకు హాజరైన తల్లిదండ్రులకు, ఆహ్వానితులకు డొక్కా సీతమ్మ మధ్యాహ్నం బడి భోజనంతో పాటు అదనపు ఆహార పదార్థాలను వడ్డించాలని కలెక్టర్ ఆదేశించారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం కార్యక్రమాలు జరిపి మెగా పేరెంట్స్ కమిటీ మీటింగ్‌ను విజయవంతం చేయాలన్నారు. సమావేశంలో డీఈఓ జనార్దన్ రెడ్డి, సమగ్ర శిక్షణ అభియాన్ అధికారి లలిత తదితరులు పాల్గొన్నారు.

ఆధునిక వ్యవసాయంపై చైతన్య పరచాలి

నంద్యాల(అర్బన్): ఆధునిక వ్యవసాయ పద్ధతులపై రైతులను చైతన్యం చేయాలని ఆర్‌ఏఆర్‌ఎస్ ఏడీఆర్ విల్సన్ అన్నారు. స్థానిక కార్యాలయంలో జిల్లా వనరుల కేంద్రం ఉప వ్యవసాయ సంచాలకులు సరళమ్మ ఆధ్వర్యంలో శనివారం నంద్యాల వ్యవసాయ సబ్ డివిజన్ క్షేత్రస్థాయి సిబ్బంది, వ్యవసాయాధికారులకు నైపుణ్య సామర్థ్యం పెంపుపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. డీఏఓ మురళీకృష్ణ, ఏడీఆర్ విల్సన్ మాట్లాడుతూ వ్యవసాయ శాఖ అమలుచేస్తున్న పథకాలను క్షేత్రస్థాయి సిబ్బంది రైతులకు అందించాలన్నారు. అలాగే..శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం కూడా అందించాలని, అప్పుడే వారు పంటల సాగులో అధిక దిగుబడులు సాధించగలరని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ రాజశేఖర్, వ్యవసాయాధికారులు ప్రసాదరావు, హేమసుందర్‌రెడ్డి, జయప్రకాష్‌రెడ్డి, సుబ్బారెడ్డి, నాగేశ్వరరెడ్డి, స్వాతి, వీఏఏలు, వీహెచ్‌ఏలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏడీఆర్ విల్సన్



మద్దిలేటి స్వామి ఆలయంలో భక్తుల రద్దీ



శ్రీశైలంలో కార్తీక దీపాలు వెలిగిస్తున్న భక్తులు

కార్తీక దీపం.. ఆధ్యాత్మిక శోభితం

కార్తీక దీపకాంతులతో పుణ్య క్షేత్రాలు వెలిగిపోతున్నాయి. శివ నామస్మరణ మార్మోగుతోంది. కార్తీక నాలుగో శనివారాన్ని పురస్కరించుకుని ఆలయాల్లో భక్తులు దీపాలు వెలిగించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇలకైలాసమైన శ్రీశైలం, బేతంచెర్ల మండలం ఆర్‌ఎస్ రంగాపురంలో వెలసిన మద్దిలేటి లక్ష్మీ నరసింహస్వామి ఆలయాల్లో భక్తజన సందడి కనిపించింది. శ్రీగిరిలో ఆలయ ధ్వజ స్తంభం వద్ద దేవస్థానం అధికారులు ఆకాశ దీపాన్ని వెలిగించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

–శ్రీశైలం టెంపుల్/ బేతంచెర్ల



మద్దిలేటి స్వామి ఆలయంలో దీపాలు వెలిగిస్తున్న మహిళలు

క్లుప్తంగా

గుండెపోటుతో ఆర్టీసీ డ్రైవర్ మృతి


ముద్దమ్మ గారి నాగరాజు (ఫైల్)

కోసిగి: మండల కేంద్రంలోని పెద్ద మసీదు సమీపంలో నివాసం ఉంటున్న ఆర్టీసీ డ్రైవర్ ముద్దమ్మ గారి నాగరాజు(45) గుండెపోటుతో మృతి చెందాడు. ఆయన కొన్నిరోజులుగా భార్య పుట్టినిల్లు కందుకూరు గ్రామంలో ఉంటూ విధులకు హాజరవుతున్నారు. అందులో భాగంగానే శనివారం తెల్లవారుజామున డ్యూటీకి వెళ్లేందుకు సిద్ధమవుతుండగా గుండెపోటుకు గురై కుప్పకూలాడు. స్థానిక వైద్యుల వద్దకు తీసుకెళ్లగా అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. మృతదేహాన్ని కోసిగికు తీసుకొచ్చారు. విషయం తెలుసుకున్న ఆదోని ఆర్టీసీ డిపో అధికారులు కోసిగికు చేరుకుని మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంత్యక్రియల నిమిత్తం డిపో తరపున రూ.10 వేలు ఆర్థిక సాయం అందజేశారు. నాగరాజుకు భార్య నాగమ్మ, ఇద్దరు కుమారులు ఉన్నారు.

ఈఎన్‌టీ శస్త్రచికిత్సలపై శిక్షణ


శిక్షణ ఇస్తున్న డాక్టర్ జయప్రకాష్‌రెడ్డి

కర్నూలు(హాస్పిటల్):నగరంలోని ఎస్‌ఆర్ పేటలోని శ్రీ సత్యసాయి ఈఎన్‌టీ హాస్పిటల్ లో రెండు రోజులపాటు నిర్వహించే 34వ హ్యాండ్స్ ఆన్ ఆసిక్యులోప్లాస్టీ, టింపనోప్లాస్టీ, మైక్రో ఇయర్ సర్జరీ ఈఎన్‌టీ శస్త్రచికిత్సల వర్క్‌షాప్ శనివారం ప్రారంభమైంది. ఈ వర్క్‌షాప్‌నకు దుబాయి నుంచి ముగ్గురు వైద్యులతోపాటు ఏపీ, తెలంగాణా, కర్ణాటక, ఒడిస్సా, కేరళ, మధ్యప్రదేశ్, ఢిల్లీ నుంచి 20 మంది నూ తన వైద్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా హాస్పిటల్ అధినేత డాక్టర్ బి.జయప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ చెవి, ముక్కుకు సంబంధించిన సూక్ష్మ ఎముకలు, ఇతర పరికరాలను సేకరించడం కష్టమని, అందువల్ల ఇలాంటి వర్క్‌షాప్ లు అరుదుగా నిర్వహిస్తారన్నారు. ఈ వర్క్‌షాప్‌లో తనతోపాటు డాక్టర్ మహేంద్ర కుమార్, డాక్టర్ నదీమ్, డాక్టర్ ప్రవీణ్‌కుమార్ రెడ్డి, డాక్టర్ కుమార్‌చౌదరి శిక్షణ అందించారన్నారు. గతంలో నిర్వహించిన వర్క్‌షాప్‌లలో శిక్షణ పొందిన వైద్యులు తమ నైపుణ్యత పెంపుదలకు ఈ వర్క్‌షాప్ బాగా తోడ్పడిందన్నారు.

మెరిసిన యశ్వంత్

- ఐఈఎస్‌లో ఆల్‌ఇండియా 18వ ర్యాంక్


యశ్వంత్ కుమార్

దొర్నిపాడు: మండలంలోని రామచంద్రాపురం గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు నాగరాజు కుమారుడు గడ్డిపాటి యశ్వంత్‌కుమార్ ఇండియన్ ఇంజినీరింగ్ సర్వీస్‌లో ఆల్ ఇండియా 18వ ర్యాంక్ సాధించారు. యశ్వంత్ కుమార్ పదవ తరగతిలో 10కి పది పాయింట్లు, ఇంటర్ ఎంపీసీలో 984 మార్కులు సాధించాడు. అనంతరం బాంబే ఐఐటీలో సీటు సాధించి బీటెక్ సివిల్ ఇంజినీరింగ్ పూర్తి చేశాడు. వెంటనే ఎయిర్‌ఫోర్స్ అథారిటీ ఆఫ్ ఇండియా చెన్నైలో ఉద్యోగం పొందాడు. యూపీఎస్సీ నిర్వహించిన ఐఈఎస్‌లో 18వ ర్యాంక్‌ను మొదటి ప్రయత్నంలోనే సాధించి తన కలను నెరవేర్చుకున్నాడు.

గేట్‌లోనూ ప్రతిభ

ఎంటెక్ కోసం నిర్వహించే గేట్‌లో ఆల్‌ఇండియా 17వ ర్యాంక్ సాధించాడు. అలాగే ఎన్విరాల్‌మెంట్ సైన్స్‌లో ఆల్ ఇండియా మొదటి ర్యాంక్ సాధించి తన సత్తా చాటాడు. ఎయిర్‌పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా డిపార్టుమెంట్ జూనియర్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఉద్యోగం పొందాడు. వాటితోపాటు ఐండియన్ ఇంజినీరింగ్ సర్వీసెస్ 18 ర్యాంక్ సాధించాడు.

‘పది’కి ప్రణాళికేదీ?

- ముంచుకొస్తున్న పదో తరగతి పరీక్షల సమయం
- హాజరుకానున్న 29 వేల మంది విద్యార్థులు
- ఇంత వరకు పూర్తికాని సిలబస్
- స్టడీ మెటీరియల్‌పై స్పష్టత కరువు
- నామమాత్రంగా ప్రత్యేక తరగతులు
- నిత్యం సమీక్షలు, సమావేశాలకే పరిమితమైన డీఈఓ
- పరీక్షా విధానంపై నేటికీ స్పష్టత రాని వైనం

టెస్ట్ ఎగ్జామ్స్ అంటేనే ఓ రకమైన వైబ్రేషన్. పదో తరగతి పిల్లలున్న ఇళ్లల్లో అయితే ఆ ఏడాదంతా కుటుంబ సభ్యులు ఎక్కడికి వెళ్లాలన్నా ఒకటికి రెండు సార్లు ఆలోచిస్తారు. ‘మా బాబు ఈసారి పదో తరగతి.. మా పాప ఈ ఏడాది టెస్ట్ ఎక్కడికీ రాలేం’ అంటూ తెగేసి చెబుతూ ఉంటారు. ప్రభుత్వాలు కూడా అంతే ప్రాధాన్యతను ఇస్తూ, ప్రత్యేక తరగతులు నిర్వహిస్తూ వంద శాతం ఫలితాలు రాబట్టేందుకు కృషి చేస్తూ ఉంటాయి. అయితే ఈ ఏడాది పరీక్షల సమయం సమీపిస్తున్నా కూటమి ప్రభుత్వానికి మాత్రం చీమ కుట్టినట్లు కూడా లేదు. సిలబస్ పూర్తి కాలేదు. స్టడీ మెటీరియల్ ఇవ్వలేదు. పరీక్ష విధానంపై స్పష్టత లేదు. నామమాత్రంగా ప్రత్యేక తరగతులతో కాలయాపన చేస్తూ వస్తుండటంతో జిల్లా వ్యాప్తంగా 29 వేల మంది విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.

కర్నూలు సిటీ: జిల్లాలో ప్రభుత్వ, జిల్లా పరిషత్, ఏపీ మోడల్ స్కూల్స్, కేజీబీవీ, రెసిడెన్షియల్ స్కూల్స్ మొత్తం 324 ఉన్నాయి. ఈ స్కూళ్లలో సుమారు 29 వేల మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాయనున్నారు. పది పరీక్షల ఫలితాలు పెంచేందుకు ఉదయం గంట, మధ్యాహ్నం గంట ప్రత్యేక స్టడీ అవర్స్ నిర్వహించాలని, ప్రత్యేక ప్రణాళికలను తయారు చేయాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా ఆదేశాలు ఇచ్చారు. అయితే స్టడీ అవర్స్ అనేవి నామమాత్రంగా జరుగుతున్నాయి. విద్యాశాఖ అధికారులు పర్యవేక్షణను గాలికొదలడంతో హెచ్‌ఎం, టీచర్లు కూడా ఏ మాత్రం శ్రద్ధ చూపడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. పది పరీక్షల ఫలితాల పెంపునకు గతంలో సబ్జెక్టు నిపుణులను ఎంపిక చేసి, వారితో స్టడీ మెటీరియల్‌ను తయారు చేయించే వారు. ఎఫ్.ఏ-1, ఎఫ్.ఏ-2 పరీక్షలతోపాటు, స్లిప్ టెస్ట్‌లలో వచ్చిన మార్కుల ఆధారంగా విద్యార్థులను ఏ, బీ, సీ, డీ కేటగిరిలుగా విభజించి సీ, డీ క్యాటగిరి విద్యార్థుల కోసం ప్రత్యేక స్టడీ మెటీరియల్‌ను తయారు చేసి, వారిపై ప్రత్యేక దృష్టి సారించేవారు. ఏ అంశాలపై ఆ విద్యార్థులు వెనకబడి ఉన్నారో తెలుసుకుని పునశ్చరణ తరగతులు సైతం నిర్వహించే వారు. కానీ ఇప్పుడు ఆ పరిస్థితులు ఎక్కడ కూడా కనిపించడం లేదు. ఆ వైపుగా విద్యాశాఖ అధికారులు చర్యలు చేపట్టడం లేదు. స్టడీ మెటీరియల్ తయారీపై ఇంత వరకు స్పష్టత లేదు.


విరుపాపురం హైస్కూల్‌లో స్టడీ అవర్‌లో విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలిస్తున్న డీఈఓ ఎస్.శామ్యూల్ పాల్

గత ఏడాది ఫలితాలపై సమీక్ష ఏదీ?

పది పరీక్షల ఫలితాలను గతేడాది వచ్చిన ఫలితాలపై సమీక్షించి గతంలో ఏఏ సబ్జెక్టులలో ఎక్కువ మంది విద్యార్థులు ఫెయిల్ అయ్యారు..అందుకు కారణాలు ఏంటి? ఈ ఏడాది వాటిని అధిగమించి మెరుగైన ఫలితాలు సాధించేందుకు విద్యాశాఖ బోధనలో అనుభవం ఉన్న సబ్జెక్టు నిపుణులతోపాటు, సీనియర్ ప్రధానోపాధ్యాయులతో సమీక్షించి తదుపరి చర్యలు తీసుకునేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాల్సి ఉంది. అయితే జిల్లా విద్యాశాఖ ఇంత వరకు ఒక్కసారి కూడా సమావేశం నిర్వహించకపోగా, ఉన్నత పాఠశాలలపై పర్యవేక్షణను గాలికొదిలేసింది. మొన్నటి దాకా డీఈఓగా ఉంటూ ఇన్‌చార్జ్ ఆర్జేడీగా పని చేసిన శామ్యూల్ సైతం పది ఫలితాల పెంపుపై ఎలాంటి సమీక్షాలు నిర్వహించలేదు. ప్రస్తుత డీఈఓగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న ఎస్.శామ్యూల్ పాల్ కూడా నిత్యం కలెక్టరేట్‌లో సమీక్షలు, కమిషనర్ వెబెక్స్, ప్రిన్సిపల్ సెక్రటరీ వీడియో కాన్ఫరెన్స్‌లతోనే బిజీగా ఉంటున్నారు. అప్పుడప్పుడు ఒకటో.. రెండో స్కూళ్లను తనిఖీ చేసి రావడమే కానీ ఇంత వరకు హైస్కూళ్ల హెచ్‌ఎంలతో పది ఫలితాల పెంపుపై ఎలాంటి సమీక్షా సమావేశాలు నిర్వహించలేదు. ఇక రెగ్యులర్ డిప్యూటీ ఈఓలు లేకపోవడంతో ఎంఈఓ-1గా పని చేసే వారికి ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు. వారి రెగ్యులర్ విధులతోపాటు, డిప్యూటీ ఈఓలుగా అదనపు బాధ్యతలకు న్యాయం చేయలేకపోతున్నారనే విమర్శలున్నాయి.

సీబీఎస్‌ఈ సిలబస్ రద్దుతో అయోమయం

జిల్లాలో 90 ఉన్నత పాఠశాలల్లో గత ప్రభుత్వం సీబీఎస్‌ఈ సిలబస్‌ను అమలు చేసింది. అయితే ప్రస్తుత ప్రభుత్వం సీబీఎస్‌ఈ స్కూళ్లను రద్దు చేసింది. సుమారుగా 3 నెలలు సీబీఎస్‌ఈ సిలబస్‌లో చదివిన విద్యార్థులు.. ఆ స్కూళ్లను రద్దు చేయడంతో ఏ సిలబస్ చదవాలి? ఏ ప్యాట్రన్‌లో పరీక్షలు రాయాలో తెలియక అయోమయంలో ఉన్నారు. కేజీబీవీలను పర్యవేక్షణ చేయాల్సిన జీసీడీఓ పోస్టు ఖాళీగా ఉంది. తాత్కాలికంగా ఓ టీచర్‌ను నియమించినా.. కేజీబీవీల్లో అడ్మిషన్లు, టీచింగ్, నాన్‌టీచింగ్ పోస్టుల భర్తీలో అకడమిక్ ఇయర్ మొదలైనప్పటి నుంచి వాటికే పరిమితమయ్యారు. ఆ స్కూళ్లను పర్యక్షవేక్షించే వారు లేకపోవడంతో అసలు అక్కడ ఏమీ జరుగుతుందో కూడా ఎవరికీ అర్థం కాని పరిస్థితులు ఉన్నాయి. ఏపీ మోడల్ స్కూళ్లపై పర్యవేక్షణకు ప్రత్యేకంగా ఓ ఏడీ ఉన్నప్పటికీ ఆ స్కూళ్ల గురించి పట్టించుకోవడం లేదు. ఆ స్కూళ్లపై పర్యవేక్షణ లేక.. టీచర్లు తరగతులు సరిగ్గా చెప్పడం లేదనే విమర్శలున్నాయి.

ప్రణాళిక తయారు చేస్తున్నాం

ఇటీవల జిల్లా కలెక్టర్ చేసిన సూచనలు మేరకే పదో తరగతి విద్యార్థులకు ప్రస్తుతం ఉదయం, సాయంత్రం స్టడీ అవర్స్ నిర్వహిస్తున్నాం. స్టడీ మెటీరియల్‌ను తయారు చేసేందుకు కర్నూలు ఎంపీ బి.నాగరాజు సాయం చేస్తామన్నారు. పరీక్షల్లో వచ్చిన మార్కుల ఆధారంగా విద్యార్థులను క్యాటగిరిలుగా వేరు చేసి సీ, డీ క్యాటగిరి పిల్లలపై ప్రత్యేక దృష్టి పెడతాం. కచ్చితంగా గతంలో కంటే మెరుగైన ఫలితాలను సాధించేందుకు చర్యలు తీసుకుంటాం. – ఎస్.శామ్యూల్ పాల్, డీఈఓ

బీసీల్లో ఐక్యత పెరగాలి

- రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖా మంత్రి ఎస్ సవితమ్మ


మాట్లాడుతున్న మంత్రి ఎస్ సవితమ్మ

కర్నూలు(అర్బన్): బీసీల్లో ఐక్యత పెరగాల్సిన అవసరముందని రాష్ట్ర బీసీ సంక్షేమం, చేనేత, జౌళీ శాఖ మంత్రి ఎస్ సవితమ్మ అభిప్రాయపడ్డారు. శనివారం స్థానిక నందికొట్కూరు రోడ్డులోని ఆదర్శ విద్యా మందిర్ ప్రాంగణంలో నిర్వహించిన బీసీ శంఖారావం మహాసభ, బీసీ కులాల వనభోజన కార్యక్రమానికి ఆమె హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ బీసీ మహిళలకు స్వయం ఉపాధి కల్పించేందుకు మొదటి విడతగా 50 వేల మందికి ఉచితంగా టైలరింగ్‌లో శిక్షణ ఇప్పించి, కుట్టు మిషన్లు అందజేస్తామన్నారు. ప్రతి నియోజక వర్గ కేంద్రంలో ఉచిత టైలరింగ్ శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. మహిళా సాధికారతలో భాగంగా అన్ని రంగాల్లో బీసీ మహిళలు ముందుండాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా నిర్మాణ దశలో ఉన్న బీసీ భవన్ల నిర్మాణాలను పూర్తి చేస్తామన్నారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్ క్రిష్ణయ్య మాట్లాడుతూ బీసీలు ఎంత కష్టమైనా సరే తమ పిల్లలను చదివించుకోవాలన్నారు. కేంద్రంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేసి, ప్రత్యేకంగా బడ్జెట్ కేటాయించాలని పోరాటాలు చేస్తూనే ఉన్నామన్నారు. కార్యక్రమంలో కర్నూలు, అనంతపురం ఎంపీలు బస్తిపాటి నాగరాజు, అంబికా లక్ష్మీనారాయణ, పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు, ఏపీ టూరిజం, కురువ, రజక కార్పొరేషన్ల చైర్మన్లు నూకరాజు బాలాజీ, మాన్వి దేవేంద్రప్ప, సావిత్రమ్మ, బీసీ సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి నక్కలమిట్ట శ్రీనివాసులు, రాష్ట్ర అధ్యక్షులు వై.నాగేశ్వరరావుయాదవ్, తదితరులు పాల్గొన్నారు.

నాయీ బ్రాహ్మణులు అభివృద్ధి చెందాలి


ప్రతిభా పురస్కారాలను అందజేస్తున్న నోపా నేతలు

కర్నూలు (అర్బన్): నాయీ బ్రాహ్మణులు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని నాయీ బ్రాహ్మణ సంఘం నేతలు సూచించారు. శనివారం నాయీ బ్రాహ్మణ అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (నోపా) ఆధ్వర్యంలో కార్తీక వన మహోత్సవం, నాయీ బ్రాహ్మణ వివాహ పరిచయ వేదిక కార్యక్రమాలను నిర్వహించారు. ఎమ్మిగనూరు డీఎస్పీ ఉపేంద్రబాబు, నోపా గౌరవ అధ్యక్షులు సీహెచ్ నవీన్ కుమార్, అధ్యక్షులు ఎం.వెంకటస్వామి, ప్రధాన కార్యదర్శి న్యాయవాది మద్దిలేటి హాజరై మాట్లాడారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. నోపా ప్రతిభా పురస్కారాల్లో భాగంగా రూ.20 వేలను ప్రోత్సాహకంగా అందించారు. కార్యక్రమంలో నోపా సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ధన విజయుడు, నాయీ బ్రాహ్మణ అఖిలభారత నిత్యాన్నదాన సత్రం ప్రధాన కార్యదర్శి ఆత్మకూరు శివయ్య, సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సంపత్‌కుమార్, రాష్ట్ర లీగల్ సెల్ కన్వీనర్ ఎం.శాంతకుమార్, యువజన సంఘం జిల్లా అధ్యక్షులు రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

హోటళ్లపై రూ.2.10 లక్షలు జరిమానా

నంద్యాల(అర్బన్): జిల్లాలోని బేకరి షాపులు, కిరాణం షాపులు, హోటళ్లు, రెస్టారెంట్లలో ఇటీవల నిర్వహించిన తనిఖీల్లో నాణ్యతా ప్రమాణాలు తక్కువగా ఉన్నాయని తేలడంతో 10 కేసులు నమోదు చేసి రూ.2.10 జరిమానా విధించినట్లు ఆహార భద్రతా అధికారి వెంకటరాముడు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సింతటిక్ ఫుడ్ కలర్స్, టేస్టింగ్ సాల్ట్, ఆహార పదార్థాల్లో వాడారని, వాటిని రసాయనిక పరీక్షల నిమిత్తం స్టేట్ ఫుడ్ ల్యాబొరేటరీకి పంపామన్నారు. హోటళ్ల యజమానులు శుభ్రత పాటించకపోతే ఆహార భద్రత చట్టం ప్రకారం శిక్షలు తప్పవన్నారు.

లారీ ఢీకొని వ్యక్తి మృతి

నందికొట్కూరు: పట్టణంలోని నంద్యాల రహదారి వైపు ప్యారడైజ్ ఫంక్షన్ హాల్ సమీపంలో శనివారం లారీ ఢీకొని ముచ్చుమర్రి గ్రామానికి చెందిన నాగన్న(50) దుర్మరణం చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. పగిడ్యాల మండలం ముచ్చుమర్రి గ్రామానికి చెందిన నాగన్న బియ్యం కోసం పట్టణానికి వచ్చినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. నంద్యాల రోడ్డులో ఉన్న రైస్ మిల్ వద్ద కాలినడకన వెళ్తుండగా లారీ ఢీకొంది. ప్రమాదంలో లారీ వెనుక టైర్లు మీద ఎక్కడంతో తీవ్ర గాయాలతో అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. పోలీసులు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతుడి భార్య సునీత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ రమణ తెలిపారు.

మోటారు సైకిళ్ల దొంగ అరెస్టు

- 12 మోటారు సైకిళ్లు, ఆటో స్వాధీనం


మోటార్ సైకిళ్లను, దొంగను చూపుతున్న పోలీసులు

కర్నూలు (టౌన్): మోటార్ సైకిళ్ల చోరీకి పాల్పడుతూ తప్పించుకు తిరుగుతున్న ఓ దొంగను పోలీసులు అరెస్టు చేశారు. శనివారం మూడో పట్టణ పోలీసు స్టేషన్‌లో డీఎస్పీ బాబుప్రసాద్ వివరాలు వెల్లడించారు. ఇటీవల కర్నూలు నగరంలో మోటార్ సైకిళ్ల దొంగతనాల కేసులు ఎక్కువగా నమోదు కావడంతో పోలీసులు ప్రత్యేకంగా దృష్టి సారించారు. అందులో భాగంగానే వాహనాల తనిఖీ చేపట్టారు. స్థానిక నంద్యాల చెక్‌పోస్టు వద్ద వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులను చూసి డోన్ కొండపేటకు చెందిన నాగుల వినయ్ ద్విచక్ర వాహనంపై పారిపోయేందుకు యత్నించాడు. పోలీసులు అతన్ని వెంబడించి పట్టుకుని విచారించగా నేరాలు అంగీకరించాడు. ఇప్పటికే ఇతడిపై 13 కేసులున్నాయి. అతని వద్ద నుంచి 12 మోటారు సైకిళ్లు, ఒక ఆటోను స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ మొత్తం రూ.9.10 లక్షలు ఉందని డీఎస్పీ తెలిపారు.

అనుమానాస్పదస్థితిలో యువకుడి మృతి


ప్రవీణ్‌కుమార్(ఫైల్)

నందికొట్కూరు: పట్టణంలోని ఏబీఎం పాలెంకు చెందిన ప్రవీణ్‌కుమార్(23) అనుమానాస్పదస్థితిలో మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన దేవదాసు, ఎస్తేరమ్మ దంపతుల కుమారు డు ప్రవీణ్‌కుమార్ డ్రైవర్‌గా పని చేస్తూ కుటుంబానికి చేదోడుగా ఉండేవాడు. శనివారం కొణిదేల గ్రామం బీసీ కాలనీకి చెందిన చేపల నరసింహుడి బొలేరో వాహనం వద్ద దుర్వాసన వస్తుండటంతో స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు అక్కడికి చేరుకుని పరిశీలించగా ప్రవీణ్‌కుమార్ మృతిచెందిఉండటంతో కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. కాగా ఎమ్మార్పీఎస్ నాయకులతో కలిసి కుటుంబ సభ్యులు ధర్నాకు దిగారు. ఎవరో హత్య చేశారని, పూర్తి స్థాయిలో విచారించి నిందితులను శిక్షించి న్యాయం చేయాలని డిమాండ్ చేశా రు. సీఐలు ప్రవీణ్‌కుమార్‌రెడ్డి,సుబ్రహ్మణ్యం డాగ్ స్క్వాడ్‌ను రప్పించి ఆధారాలు సేకరించా రు. అనంతరం మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి,దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ చంద్రశేఖర్ తెలిపారు.

వదిన, మరిది ఒకే రోజు మృతి

- శోక సంద్రంలో కుటుంబసభ్యులు, బంధువులు


సుజాతమ్మ (ఫైల్)


జగదీశ్వరరావు (ఫైల్)

జూపాడుబంగ్లా: అన్న భార్య వదిన మృతిచెందటంతో ఆమె అంత్యక్రియలకు వచ్చిన మరిది గుండెపోటుతో మృతిచెందిన ఘటన మండలంలోని తర్తూరు గ్రామంలో శుక్రవారం సాయంత్రం చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. తర్తూరు గ్రామానికి చెందిన సుజాతమ్మ(65) అనారోగ్యంతో శుక్రవారం ఉదయం మృతిచెందింది. విషయం తెలుసుకున్న నందికొట్కూరులో ఉంటున్న ఆమె మరిది జగదీశ్వరరావు(62) కుటుంబ సభ్యులతో కలిసి అంత్యక్రియలకు హాజరయ్యేందుకు తర్తూరు గ్రామానికి వచ్చారు. అప్పటి వరకు బాగానే ఉన్న జగదీశ్వరరావు సాయంత్రం 6.30గంటల ప్రాంతంలో గుండెపోటుతో ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. కుటుంబసభ్యులు ఆసుపత్రికి తరలించేలోగానే మృతిచెందాడు. ఉదయం సుజాతమ్మ, సాయంత్రం జగదీశ్వరరావు మృతిచెందటంతో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపించారు. ఇద్దరి అంత్యక్రియలు శనివారం తర్తూరు గ్రామంలోనే నిర్వహించారు.

మద్యం నాణ్యత పరిశీలనకు అధునాతన పరికరాలు

కర్నూలు (టౌన్): రాష్ట్ర ప్రభుత్వం అధునాతన టెస్టింగ్ పరికరాల ద్వారా పరీక్షలు నిర్వహించి నాణ్యమైన మద్యాన్ని అందించేలా చర్యలు తీసుకుంటోందని జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా అన్నారు. శనివారం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కాంప్లెక్స్‌లో ఉన్న రీజినల్ ఎక్సైజ్ లేబరేటరీని కలెక్టర్ సందర్శించారు. కొత్తగా వచ్చిన టెస్టింగ్ మిషినరీ, ఇన్‌స్ట్రుమెంట్ల ద్వారా ల్యాబొరేటరీలో జరుగుతున్న అన్ని రకాల పరీక్షలు, టెస్టింగ్ పద్ధతులు, రిపోర్టులు పొందుపరిచే వివరాలు, పరికరాల పనితీరును కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు డిస్టిలరీస్‌లో తయారయ్యే మద్యం నాణ్యతను, పరిమాణాన్ని పరిశీలించేందుకు ప్రభుత్వం గ్యాస్ క్రొమోటోగ్రఫీ, అటామిక్ అబ్జార్షన్ స్పెక్ట్రోస్కోపీ (ఏఏఎస్) యంత్రాలను ఏర్పాటు చేసిందన్నారు. బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ ప్రకారం ఈ యంత్రాల ద్వారా మద్యం నాణ్యతను, పరిమాణాన్ని పరీక్షించడం జరుగుతోందన్నారు. హయ్యర్ ఆల్కహాల్స్, కాపర్, లెడ్‌లాంటి లోహాలు పరిమితి లోపు ఉన్నాయా లేదా పరీక్షించి నాణ్యమైన మద్యంను అందించడం జరుగుతోందన్నారు. అనంతరం కలెక్టర్ సహాయ కమిషనర్ కార్యాలయాన్ని సందర్శించి రికార్డులు పరిశీలించారు. ఆయన వెంట అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కళ్యాణి, అసిస్టెంట్ కమిషనర్ హనుమంతరావు, ఎక్సైజ్ సూపరింటెండెంట్ సుధీర్ బాబు, కెమికల్ ఎగ్జామినర్ హరిత, ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.